# కొత్త సీసాలో పాత సారా!

**మోపిదేవి దుర్గాప్రసాదరావు**

ప్రొఫెసర్ శంకరం అసహనంగా తన లాబొరేటరీలో పచార్లు చేస్తున్నాడు. పీచులా ఉన్న జుట్టు చిందర వందరగా మొహంమీదకు పడి అసహ్యంగా కనిపిస్తోంది. చూడటానికి అరవై సంవత్సరాల నాడిలా కనిపిస్తున్నా, శంకరం అసలు వయస్సు ఏభై ఏళ్లు మాత్రమే.

తీక్ష్ణంగా ఉన్న ఎండ రోడ్డుమీది వాళ్లను మాడ్చేస్తున్నా, శంకరాన్ని మాత్రం ఏమీ చేయలేకపోతూంది. లాబొరేటరీ అంతాఎయిర్-కండిషన్ చేయబడింది. రకరకాల పరికరాలు జాగ్రత్తగా అమర్చబడి ఉన్నాయి. శంకరం కూర్చునే కుర్చీ ముందున్న బల్లమీది గాజు శీకరులో పసుపు పచ్చని ద్రవపదార్థం ఉంది. గదిఅంతా పచార్లు చేస్తూ మధ్య మధ్యలో గాజుశీకరు వంక పరీక్షగా చూస్తున్న శంకరం ఒంటరిగా ఉన్న తన పిల్లలకు ఏ జంతువైనా హాని తలపెట్టుతుందేమో నని నలు దిక్కులా పరీక్షగా చూస్తున్న ఆడసింహంలా ఉన్నాడు.

శంకరం హార్వర్డు యూనివర్సిటీలో చదివి రసాయన శాస్త్రంలో డాక్టరేట్ తెచ్చుకొన్నాడు. ఆనాటినుండి నేటి వరకు తన జీవితమంతా శాస్త్ర పరిశోధనకు అంకితం చేశాడు. లాబొరేటరీయే అతని సర్వస్వం. క్రిందటి ఇరవై సంవత్సరాలలోనూ అతను ప్రచురించిన రీసెర్చి పేపర్లు రెండు వందల దాకా ఉంటాయి. తెలివిగలవాళ్లందరకూ ఉన్నట్టే, శంకరానికికూడా వేపకాయంత వెర్రి ఉంది. ఏదైనా కొత్త విషయం కనిపెట్టినప్పుడు అది ఎవరికి కీడు చేస్తుంది, ఎవరికి మేలు చేస్తుందని ఆలోచిస్తాడు. అది ఎవరికీ ఏ విధమైన అపకారం చేయదని తెలుసుకున్న తరవాత ఆ విషయం బయట పెడతాడు. సైంటిస్ట్ బాధ్యతగల పౌరుడుగా వ్యవహరించాలని అతని అభిప్రాయం. మానవాళికి ఏమాత్రం అపకారం చేసే ఏ పరిశోధన అయినా కొనసాగించకూడదని వాదించే వాడు.

శంకరం విసుగ్గా గడియారం వంక చూస్తున్నాడు. మరో అయిదు నిమిషాల్లో శంకరం ఎదురు చూస్తున్న ముగ్గురూ ఒకరి తరవాత ఒకరు చొప్పున వచ్చారు. అందరూ దరిదాపుగా ఏభై ఏళ్లవారే!

ముందుగా గదిలో అడుగు పెట్టిన పెద్దమనిషి పేరు రమణయ్య. నల్లగా, పొట్టిగా, సన్నగా ఉన్నాడు. రెండవ అతను గోవిందరావు. మొదటి అతనికి విరుద్ధంగా పొడుగ్గా, లావుగా, ఎర్రగా ఉన్నాడు. మూడవ వ్యక్తి రామారావు. లోకంలోని బరువు బాధ్యతలన్నీ తనే మోస్తున్నట్టుగా దిగులుగా ఉన్నాడు. అంతేకాదు, కాసేపటిలో తానేదో నిర్ణయం తీసుకోబోతున్నట్టు, ఆ నిర్ణయం మీదనే ప్రపంచం భవిష్యత్తు ఆధారపడి ఉన్నట్టుగా అతి తీవ్రం ఆలోచిస్తున్నాడు.

అందరూ కూర్చున్న తరవాత శంకరం సన్నగా దగ్గి మొదలు పెట్టాడు.

"మిమ్మల్ని ఎందుకు పిలిపించానా అని ఆలోచిస్తున్నట్టున్నారు?" అంటూ వాళ్ల మొహంలోకి చూడగానే అవు నన్నట్టుగా తలలు ఊగాయి.

"నేను అయిదేళ్లుగా చేస్తున్న పరిశోధన నిన్నటితో పూర్తయింది. ఈ పరిశోధనకు సంబంధించిన ఫార్ములాలు ప్రభుత్వానికి అప్పచెప్పుతా ననుకున్నాను మొదట్లో. కాని, నిన్న రాత్రి నా నిర్ణయం మార్చుకున్నాను. ఈ పరిశోధన వల్ల కలిగే మంచి ఫలితాలను ముందుగా నా చిన్ననాటి స్నేహితులయిన మీ ముగ్గురూ అనుభవించాలని నా కోరిక."

అందరూ ఆత్రతగా శంకరం మొహం లోకి చూడసాగారు, ఒక్క రామారావు తప్ప. వాళ్ల కళ్లలో ఆ పరిశోధన ఏమిటో తెలుసుకోవాలన్న ఉత్సుకత స్పష్టంగా కనిపిస్తోంది. రామారావు మాత్రం సందేహంగా శంకరం వంక చూడసాగాడు. 'ఇతగాడు వేళాకోళమాడు తున్నాడా, లేకపోతే నిజంగానే. . .' అని ఆలోచిస్తున్నాడు.

ప్రొఫెసర్ శంకరం ఇదేమీ పట్టించు కోకుండా, బల్లమీదున్న గాజు శీకరు పైకెత్తి అందరికీ కనపడేట్టుగా పట్టు కొన్నాడు.

"ఈ శీకరులో ఉన్న ద్రవం చూశారా? ఇది తయారు చేయడానికి యుగ యుగాలుగా చాలామంది మేధావులు ప్రయత్నిస్తున్నారు. కానీ, కొన్ని కారణాల వల్ల వాళ్లెవ్వరూ సాధించలేకపోయారు" అంటూ అందరి వేపూ విజయగర్వంతో చూశాడు.



"ఈ ద్రవపదార్థంతో రాగిని బంగారంగా మార్చవచ్చు."

శంకరం మాటలకు ముగ్గురూ ఆశ్చర్యంతో స్తంభించిపోయారు. వాళ్ళు చూస్తున్నది, వింటున్నది అంతా కలలో నేమోననే అనుమానంలో పడ్డారు. రాగిని బంగారంగా మార్చగల పచ్చని నీళ్లను తమ కళ్లతో చూస్తున్నారు. తమ కళ్ళముందు మహాద్భుతమైన రసాయన పదార్థం ఉంది.

ఆశ్చర్యంలోనుంచి తేరుకొన్న వాళ్ల మొహాల్లో కుతూహలం స్థానే ఆనంద రేఖలు పొడసూపాయి. కానీ, ముడుతలు పడ్డ మొహాల్లో అవి స్పష్టంగా కనిపించడం లేదు.

అందరికంటే ముందుగా కోలుకొన్న రామారావు కొంచెం అనుమానంగా శంకరం వేపు చూస్తూ, "శంకరం! బీకరులో ఉన్న ఆ నీళ్లు రాగిని బంగారంగా ఎలా మార్చగలుగుతాయో నా కర్థం కావడం లేదు" అన్నాడు.

శంకరం చిరునవ్వుతో అందరి వంకా చూస్తూ గొంతు సవరించుకొని మొదలు పెట్టాడు.

"ఆటమ్ గురించి మీరు విన్నారు కదా? ప్రతి ఆటమ్‌లోనూ ఎలక్ట్రానులు, ప్రోటానులు, న్యూట్రానులు ఉంటాయి. ఎలక్ట్రానులు కేంద్రకం చుట్టూ తిరుగుతూ ఉంటాయి.

"రాగి ప్రతి ఆటమ్‌లోనూ ఇరవై తొమ్మిది ఎలక్ట్రాన్లు, ఇరవై తొమ్మిది ప్రోటాన్లు, ముప్పై నాలుగు న్యూట్రాన్లు ఉంటాయి. అలాగే బంగారం ప్రతి ఆటమ్‌లోనూ డెబ్బై తొమ్మిది న్యూట్రాన్లు, డెబ్బై తొమ్మిది ప్రొటాన్లు, నూటపద్దెనిమిది న్యూట్రాన్లు ఉంటాయి. ఇప్పుడు న్యూక్లియర్ రియాక్షన్ ద్వారా 'ఫ్యూషన్' చేసి రాగిలోని అన్ని ఆటమ్‌లనూ పేక ముక్కలు కలిపినట్టుగా కలిపి ప్రతి ఆటమ్‌లోనూ డెబ్బై తొమ్మిది ఎలక్ట్రాన్లు, డెబ్బై తొమ్మిది ప్రోటాన్లు, నూట పద్దెనిమిది న్యూట్రాన్లు ఉండేటట్టుగా చేయగలిగితే, రాగి బంగారంగా మారి పోతుంది. కాని, ఇప్పటివరకూ చేసిన పరిశోధనలు విఫలమవడానికి కారణం ఖర్చు. దరిదాపుగా వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టితే, ఈ పద్ధతిలో ఒక రూపాయి ఖరీదు చేసే బంగారం తయారు చేయవచ్చు.

"నేను చేసిన ప్రయోగం మూలంగా అతి తక్కువ ఖర్చుతో బంగారం తయారు చేయవచ్చు. న్యూక్లియర్ రియాక్షన్ క్రియేట్ చేయడానికి నేను ప్లాస్మా ఎనర్జీ వాడాను."

"అది సరే, ఈ ద్రవపదార్థం ఎలా పని చేస్తుంది?"

"ఈ ద్రవం కొన్ని రసాయనిక ప్రక్రియల ద్వారా ప్లాస్మా ఎనర్జీని ఉత్పత్తి చేస్తుంది. ఇంకా వివరంగా చెప్పినా సైన్సు తెలియని మీకు సరిగ్గా అర్థం కాకపోవచ్చు. కాబట్టి, అది ఎలా పని చేస్తుందో మీరే కళ్ళారా చూద్దురు గాని తరవాత" అంటూ అందరి మొహాల్లోకి చూస్తూ, "మీ రందరూ వచ్చే ఆదివారంవాడు వీలైనంత రాగి పుచ్చుకు వస్తే బంగారంగా మార్చి ఇస్తాను" అన్నాడు.

మాట్లాడటం ఆపి నవ్వుతూ అందరి వంకా చూస్తూ తన కుర్చీలో కూర్చున్నాడు శంకరం. కలత నిద్రలోనుంచి అప్పుడే మెలకువవచ్చినట్టుగా రమణయ్య, గోవిందరావు మెల్లగా లేచారు. ఆ తరవాత గబగబ హడావుడిగా వెనక దయ్యాలు తరుముతున్నట్టుగా వెళ్లబోయి, "ఆ మరొక్క సంగతి" అన్న మాటలకు ఆగారు.

"మరేం లేదు. మీ ముగ్గుర్నీ ఎన్నుకోవడానికి ఓ చిన్న కారణం ఉంది. మీ ముగ్గురూ ఒకప్పుడు దర్జాగా బ్రతికినవాళ్లు. అదృష్టం కలిసిరాకనో, మీరు అనుసరించిన దారి సరిగ్గా లేక పోవడంవల్లనో ఇప్పుడు మీ రంతా చెరువునుండి బయటపడ్డ చేపల్లా దీన స్థితిలో ఉన్నారు. గత అనుభవాల ద్వారా మీరు అనేక విషయాలు నేర్చుకొని ఉంటారు. వాటన్నింటిని ఆచరణలో పెడతారని ఆశిస్తున్నాను."

'ఓ, దానికేం భాగ్యం! అలాగే!' అన్నట్టుగా తల లాడిస్తూ పరుగు లాంటి నడకతో లాబొరేటరీనుండి బయటపడ్డారు రమణయ్య, గోవిందరావు.

రామారావు మాత్రం ఏమీ మాట్లాడకుండా అలాగే కూర్చున్నాడు చాలాసేపు. మెల్లిగా లేచి వెళ్లి గాజు బీకరు వంక పరీక్షగా చూశాడు.

శంకరం దగ్గరగా వెళ్లి మొహంలో మొహం పెట్టి, వణుకుతున్న కంఠంతో అడిగాడు: "శంకరం! నువ్వు చెప్పిందంతా నిజమేనా?"

* * *

దారిలో రమణయ్య, గోవిందరావు ఏమీ మాట్లాడుకోలేదు. విడిపోయేటప్పుడు మాత్రం 'మళ్లీ కలుద్దాం' అన్నట్టుగా ఓ మూలుగు మూలిగి, తల పైకెగరేసి చెరో దారి పట్టారు.

రమణయ్య మనస్సు ఆనందంతో తేలిపోతూంది. ఎన్ని సంవత్సరాల తరవాత మళ్లీ తను బంగారం మాట వింటున్నాడు! ఎంత రాగి దొరకబుచ్చుకుంటే అంత ధనవంతు డవుతాడు తను.

రమణయ్య తండ్రి బాగా ఆస్తి సంపాదించి, తను తినకుండా అంతా కొడుకుకు ధారాదత్తం చేసిపోయాడు. చిన్న వయస్సు లోనే నాలుగు తరాలకు సరిపోయే డబ్బు దొరికేసరికి రమణయ్యకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. రాత్రింబగళ్ళు క్లబ్బుల్లో గడపటం అలవాటు చేసుకున్నాడు. జీవితంలో సుఖం చవి చూడాలంటే అతగాడి దృష్టిలో పేకాడటం రావాలి. జీవితంలోని సుఖం అంతా రెండు చేతులతోనూ జుర్రుకోవాలంటే పేకాట ఆడటానికి డబ్బుండాలి. ఈ రెండూ పుష్కలంగా ఉన్న రమణయ్య జీవితాన్ని పూర్తిగా అనుభవించాడనే చెప్పాలి (ఇదీ అతగాడి అభిప్రాయమే). లోకుల దృష్టిలో అతగాడు చేసిన ఒకే ఒక్క మంచి పని — పెళ్లి చేసుకోకుండా ఉండటం.

**గత అనుభవాలు నేర్పిన గుణపాఠాలు ఎప్పటికప్పుడు మరిచిపోయి, మళ్లీ అదే తప్పు చేస్తూండడం మనుష్యుల అలవాటు. తెలివి తేటలకూ, బ్రతుకు తెరువుకూ సంబంధం ఎక్కడ? పరీక్షలు రాయడానికీ, పాసవడానికీ సంబంధం లేనట్లే బ్రతుకు పందెపు పరుగులో జయాపజయాలు కూడా ఆ కోవకు చెందినవే.**

పేకాటకు జీవితాన్ని అంకితం చేసిన రమణయ్య తన నలభయ్యవ ఏట, అంటే పదేళ్ల క్రితం బికారిలా వీధిలో నిలబడవలసి వచ్చింది. ఉన్న ఆస్తంతా కరిగిపోగా, మిగిలింది ఏభై వేల రూపాయలు ఖరీదు చేసే ఇల్లు మాత్రమే. అదీ ప్రస్తుతం తాకట్టులో ఉంది.

ఇంటికి వచ్చి మంచంలో కూలబడ్డ రమణయ్య బుర్ర రకరకాల ఆలోచనలతో సతమతమవుతూంది. ఆ వచ్చే బంగారం ఏమిటి చెయ్యాలన్న ఆలోచన పట్టుకొని పీడిస్తూంది.

అదేదో దేశంలో రకరకాల జూదాలు ఆడటానికి పెద్ద పెద్ద క్లబ్బు లుంటాయంట. వాటిని "కాసినో" కాబోలు అంటారు. అలువంటి దొకటి కట్టిస్తే?

పేపర్లలో 'ఇండియాలో మొట్ట మొదటి కాసినో కట్టించిన సంస్కర్త శ్రీ రమణయ్య' అని పడటం ఊహించుకొని గాలిలో తేలిపోసాగాడు.

'కాసినో కట్టించిన తరవాత రోజంతా అక్కడే ఉండి ఆడవచ్చు . . . ఒకసారి మాత్రం దగుల్బాజీ బెనర్జీ గాడితో ఆడకూడదు. ఆటలో మోసం చేస్తాడు, వెధవ. . . తరవాత రాంసింగు నొకణ్ణి కాసినో లోపలకు రానివ్వకూడదు . . . ఏంబోతు గడ్డం వాడూను. . . ఇంకొక్క వారం రోజులు. . . ఇల్లంతా బంగారం.'

ఆలోచనలు పక్కకు పెట్టి లేచి నిలబడ్డాడు రమణయ్య. తను వెంటనే రాగి సంపాదించే మార్గం చూడాలి. 'ఇల్లు తాకట్టు పెట్టుకొన్న సేఠ్ దగ్గరకు వెళ్లి, ఇల్లు అమ్మేస్తే కనీసం రెండు వేలు రావచ్చు. ఆ డబ్బుతో వెంటనే రాగి కొనాలి.'

ఇంటికి తాళం వేసి బయలుదేరాడు.

* * *

మధ్యాహ్నం మూడు గంటల సమయం. రమణయ్య ఇంట్లో అందరూ చేరారు. గోవిందరావు మహా ఉల్లాసంగా ఉన్నాడు. రామారావు సోఫాలో బాసింపట్టు వేసుకొని వెనక్కి జారగిలబడి కూర్చున్నాడు.

"ఇంతకీ, ఎంత పోగు చేశావు?" రామారావు రహస్యం మాట్లాడుతున్నంత మెల్లిగా అడిగాడు.

"ఆ! ఎంత? రెండు వేలు" అంటూ మొహమాటంగా రమణయ్య సమాధానం చెప్పాడు.

గోవిందరావుకు చిరాగ్గా ఉంది. రేపు పొద్దున పది గంటలకు రమ్మని శంకరం చెప్పాడు. ఆ వచ్చే బంగారంతో ఏమి చెయ్యాలన్న ఆలోచన తన కింకా తెగ లేదు. మధ్యాహ్నం కూర్చుని తీరిగ్గా ఆలోచిద్దామనుకుంటే, వెధవ లిద్దరూ తగలడి ఇక్కడకు తొక్కొచ్చారు.

"ఓయ్, గోవిందం! నీ దగ్గ రెంత?" రామారావు గట్టిగా అరిచాడు.

"రమణయ్య దగ్గర కంటే తక్కువే. ఒకటిన్నర."

ఈ డబ్బు సంపాదించడానికి చచ్చి చెడి వాయుంగలి విస్సపాలయింది. స్వంత

ఊర్లో ఉన్న ఆ ఎకరం చెక్క అమ్మకానికి పెట్టితే, తన అవసరం కనిపెట్టి అప్రాచ్యులంతా కలిసి ధర పలక్కుండా చేశారు.

"మమ్మల్నందరినీ అడుగుతున్నావు గానీ, నీ దగ్గ రెంతుందో చెప్పవేం?" అడగటం అయితే అడిగాడుగాని, సమాధానం గురించి పట్టించుకోలేదు గోవిందరావు.

గోవిందరావు కళ్లముందు నలభై గుర్రాలు పరుగెత్తుతున్నాయి. ఇహ నుంచి తను చాలా జాగ్రత్తగా ఉండాలి గుర్రప్పందేల విషయంలో. తను ఎప్పుడు పందెం కాసినా, గుర్రాల్ని చూసి, ఆ గుర్రం ఇంతకుముందు ఎన్ని సార్లు గెలిచిందో కనుక్కొని మరీ కట్టేవాడు. కానీ, ఏనాడూ అదృష్టదేవత కనికరించ లేదు. తన దగ్గరున్న డబ్బంతా అయి పోయాక అసలు కిటుకు తెలిసింది. ఈసారి పందెంలో జాకీ ఎవడో కనుక్కోవాలి. అంతేకాదు, గుర్రం యజమాని ఎవడోకూడా కనుక్కోవాలి. ఎందుకంటే, బాగా డబ్బున్న వాడి గుర్రం ఎప్పుడూ గెలుస్తుంది. దేవుడు మేలు చేస్తే రెండు మూడు గుర్రాలుకూడా కొనాలి.

గోవిందరావుకు తను కొన్న గుర్రం తతిమ్మా వాటికంటే ఓ వంద గజాలు ముందు పరుగు తియ్యటం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ తెల్ల గుర్రం కళ్లలో ఎత్తురొమ్ముల బుచ్చెమ్మ నవ్వుతూ చేతు లూపుతూంది. అతగాడి ఆలోచనలు గుర్రంతోకను వదిలి బుచ్చెమ్మ చుట్టూ తిరగడం మొదలెట్టాయి.

పుట్టిన వెంటనే నాన్నమ్మ పేరని బుచ్చెమ్మ అని నామకరణం చేశారు. కానీ, తన చేతిలోకి రాగానే బుచ్చేశ్వరి అని మార్చేశాడు . . . ఆడదంటే అదీ ... ఎండుగా, బలంగా ఉంటుంది. ఎలాటి మొగాడైనా సరే, బుచ్చిని చూడ గానే నీరుకారిపోవలసిందే.

రేసుకోర్సులో బైనాక్యులర్స్ పెట్టుకొని గుర్రాల వంక చూస్తూ, పైట ఉందో లేదోకూడా చూసుకో కుండా, తనతోపాటు సమానంగా పెద్దగా అరిచే బుచ్చెమ్మ రూపు గుర్తుకు రాగానే గోవిందరావు ఒళ్లంతా తిమ్మిరెక్కింది.

'ఒక చేతిలో వైట్ హార్సు సీసా, మరో చేతిలో బుచ్చెమ్మ నడుము ఉంటే...నా సామిరంగా ఈ జీవితంలో ఇంకా కావలిసిం దేమిటి?. . . మరిచి పోయాను, రేసులుకూడా కావాలి.'

రేపు పది గంటలకల్లా తన దగ్గర లక్షలు, లక్షలు మూలుగుతాయని తెలియ గానే ఎక్కడున్నా ఎగిరి వచ్చి వాలుతుంది . . . తన దగ్గరున్న డబ్బంతా గుర్రప్పందే లలో పోగానే, విధిలేక తనను వదిలి వెళ్లి పోయింది.

రామారావు బలంగా బుజం పట్టుకు కుదుపుతుంటే ఉలిక్కిపడి చూశాడు.

"మరీ అంత ఆలోచ నేమిటి, బ్రదర్! ఏయే ప్లానులు వేస్తున్నావో చెప్ప కూడదా?"


బంగారం లాంటి ఆలోచనలు చెదర కొట్టినందుకు కోపం వచ్చింది గోవింద రావుకు. "నా దేముంది కానీ, నీ ప్లానులు చెప్పరాదూ ముందు?" అన్నాడు చిరాకు నణుచుకుంటూ.

"వాడి సంగతి తెలియని దేముంది? మళ్లీ ఎలక్షన్లు, రాజకీయాలు— మామూలే." గారపళ్లు బయట పెట్టి నవ్వాడు రమణయ్య.

వెంటనే రామారావు సీరియస్‌గా మారిపోయాడు.

"పూర్వం రోమ్‌లో ఓ మంచి పద్ధతి ఉండేది. డబ్బున్న ప్రతి వాడూ తన చుట్టూ పెద్ద సైన్యం ఉంచుకొనే వాడు. చక్రవర్తిగారు ఇతర దేశాల మీదకు దండెత్తినప్పుడు వీళ్లకూడా

# మార్గదర్శులు



## చంద్రగోళంలో కాలుమోపిన తొలి మానవులు

చంద్రగోళంలో అడుగుపెట్టిన తొలి మానవులు అమెరికనులు— నీల్ ఎ. ఆర్మ్‌స్ట్రాంగ్, కర్నల్ ఎడ్విన్ 'బజ్' ఆల్‌డ్రిన్. ఉభయుల వయసు 39 సంవత్సరాలు. వారీ ఘనకార్యాన్ని 1969 జూలై 20 వ తేదీని సాధించారు.


కర్నల్‌మైఖేల్ కాలిన్స్‌తో కలిసి వారు జూలై 16 న అపోలో—11 లో భూగోళం విడిచి రోదసియానం ప్రారంభించారు. మూడు రోజుల తరవాత అపోలో చంద్రుని చుట్టూ పరిభ్రమణం ప్రారంభించింది. మరి 24 గంటల తరవాత చంద్రగోళంలో దిగడానికి ఉద్దేశించిన 'ఈగిల్' నౌక అపోలో (కమాండ్ మాడ్యూల్ ) నుంచి విడివడింది.

ఈగిల్ చంద్రగోళంలోని ఒక అగ్నిపర్వతం దిశగా పోతూ ఉండడం కంప్యూటర్ల సహాయంతో గమనించిన పర్యవేక్షకులు ఆందోళన చెందారు. ఆర్మ్‌స్ట్రాంగ్ బాధ్యత స్వీకరించి నైపుణ్యంతో ఈగిల్‌ను సురక్షితంగా చంద్రగోళంలో దింపాడు.

రాత్రి 10—56 గంటలకు చంద్రగోళంలో కాలూనుతూ, "మానవుని కిదొక చిన్న అడుగు. అయినా మానవజాతి కిదొక బ్రహ్మాండమైన ముందడుగు" అని ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నాడు.

చాలా గంటల తరవాత ఆర్మ్‌స్ట్రాంగ్, ఆల్డ్రిన్ తిరిగి ఈగిల్‌లో ప్రవేశించి, చంద్రగోళం విడిచి, సురక్షితంగా అపోలో చేరుకొన్నారు.

ఎనిమిది రోజులపాటు పది లక్షల మైళ్లకు పైగా రోదసి యానం సాగించి, కాలిన్స్‌తో కలిసి వారు జూలై 24 వ తేదీని భూమికి తిరిగి వచ్చారు.




వెళ్ళి గెలిచేంతవరకూ డోమికు వస్తే వారు. అయినంట పెద్దతే మళ్ళీ ఇప్పుడు పెట్టితే బాగుంటుం దనుకుంటాను. ఈ సెఫవ డిపాజిట్ కసిలో పెద్ద పీకులాట ఉంచుతున్నా, బాబూ! ఎలక్షన్లకు ముందు ఓటు వేస్తానని డబ్బు తీసుకుని, సెఫవకు వెంట్ నాడికి వేస్తారు. అప్పుడు వని పని తరుక్కవరమే! ప్రతి సారీ ఎలక్షన్లలో ఆదే జరిగేది నాకు. ఫిండారావు సెఫవు." ఆనకు ఓటు వేయని సెఫవ మీద బూతులు మొదలుపెట్టాడు రామారావు.

"సరేలే, నీ సెఫవ పంచాంగం ఆపు, నాయనా, వినలేక చస్తున్నాం." చెవులు మూసుకుంటూ గట్టిగా అరిచారు మిగిలిన ఇద్దరూ. రమణయ్య, గోవిందరావు ఇద్దరూ డబ్బు తీసుకుని రామారావుకు ఓటు వేయని సెఫవం లిస్టులోకే వస్తారు.

మాట్లాడే విషయం మార్చాలన్న ఉద్దేశ్యంతో గోవిందరావు అడిగాడు: "డబ్బు వస్తుందని తెలియగానే మీ ఆవిడ ఎగిరి గంతేసి ఉంటుంది! అవునా?"

"పెళ్ళాలు లేని అదృష్టవంతులు. మీ కేం ఎన్నైనా అంటారు. నేను పడ్డ బాధలు పగవాడికికూడా వద్దు. నేను ఎలక్షన్లలో ఓడిపోయినప్పుడల్లా నా పెళ్ళాం ఎగిరి గంతేసేది. అది ఈ దేశంలో పుట్టాల్సిన మనిషి కాదు. పవిత్రమైన భారతదేశంలో, అతి పవిత్ర భారతనారిగా జన్మించి, మొగుడు కష్టాల్లో ఉన్నప్పుడు నవ్వేది. ఆదేమిటంటే తనకు రాజకీయాలు, నేను చేసే పనులు ఇష్టం లేదట. అందుకని నేను ఓడిపోయినప్పుడల్లా—'ఇహనైనా నా మొగుడికి బుద్ధి వస్తుంది. హాయిగా ఇంటి పట్టున ఉండి, ఎవరి నెత్తినీమీదా చేతులు పెట్ట కుండా ఉంటాడేమో' అని సంతోషించే దట. ఇహ ఇలా కాదని, అది ఎగిరి గంతేయడానికి వీలు లేకుండా నడుం విరగ్గొట్టేశాను. మొన్న బంగారం వస్తుందని చెప్పగానే ఏడుపు మొదలు పెట్టింది" అని ఆగి, "అబ్బే, దాని ఏడుపు బంగారం వస్తుందని కాదు. ఆ బంగారంతో వడ్డాణం చేయించుకొని పెట్టుకోవడానికి నడుం లేదు కదా అని" అంటూ ఆఖరు చేశాడు.

తతిమ్మా ఇద్దరికీ ఈ సంభాషణ అంతగా రుచించలేదు. కాసేపటికి గోవిందరావు—"రేపు కలుద్దాం" అంటూ వెళ్ళిపోయాడు.

రామారావు, రమణయ్య ఒకరి మొహాలు ఒకరు చూస్తూ కూర్చున్నారు.

రామారావు మెల్లిగా జేబులోనుంచి పేకముక్కలు తీస్తూ, "రమణయ్యా! నా, ఆట వేద్దాం" అన్నాడు. పేక ముక్కల్ని చూడగానే రమణయ్య ఏదో అదృశ్యశక్తి ఆడించినట్టుగా అప్రయత్నంగా ముందుకు వంగి, పేక అందుకొని, "ఫింకా పలాస్ ఆడదాం" అన్నాడు.

* * *

తిండిమీద పదియ్యే సరికల్లా శంకరం లాబొరేటరీకి వచ్చి పడ్డాడు రామారావు. మార్కెట్లోనుంచి రెండు చెక్క పెట్టెలు మోయించుకొచ్చి శంకరానికి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"కరెక్టుగా టైమ్ కొచ్చేశావు. తతిమ్మా వాళ్ళేరి?" అంటూ శంకరం చెక్క పెట్టెలను తెరిచి రాగి ముద్దల వంక చూడసాగాడు.

"గోవిందరావు ఇంకా ఎందుకు రాలేదో తెలియదు కానీ, రమణయ్య మాత్రం రాడు" అన్నాడు రామారావు.

'ఎందుకని?' అన్నట్టుగా కనుబొమ లెగరేసిన శంకరానికి సమాధానంగా, "ఆత పాత వెధవ. నా దగ్గరున్న రాగి కాజేయా లని నన్ను ఫింకా పలాస్ ఆడమన్నాడు. ఆడాను. వాడు ఓడిపోయాడు, నేను గెలిచాను. అంతే" అన్నాడు.

ఆశ్చర్యంతో నోరు తెరిచాడు శంకరం.

"నీకు పేకముక్కలు పట్టుకోవడం కూడా రాదుగా! ఎలా గెలిచావు?"

"నువ్వు సైంటిస్టువే గాని, శంకరం, ఇటువంటి విషయాల్లో పిచ్చి దద్దమ్మవు. పరీక్షలు రాయడానికి, పాసవడానికి సంబంధం లేనట్టుగానే, పేక ఆడటం తెలియడానికి, అందులో గెలవడానికి సంబంధం లేదు. కావలిసినదంతా బుర్ర. ఆ బుర్రలో మెదడు." వికటంగా నవ్వాడు రామారావు.

"అంటే . . . అంటే నువ్వు రమణయ్యను మోసం. . ."

శంకరం మాటలకు అడ్డొచ్చాడు రామారావు. "అదంతా అనవసరం, శంకరం! ఇదంతా బ్రతుకు కోసం పోరాటం. ఎవడు తెలివిగలవాడైతే వాడు గెలుస్తాడు. తతిమ్మా వాళ్ళంతా వస్తారు. లేదా గెలిచినవాడికి ఊడిగం చేస్తూ బ్రతుకుతారు."

రామారావు గురించి పూర్తిగా తెలిసిన శంకరం మరేమీ మాట్లాడ లేదు. "అయితే సరే. గోవిందరావు వచ్చిన తరవాత మన పని మొదలెడతాం" అంటూ టేబుల్‌మీదున్న జర్నల్ తిరగేయసాగాడు శంకరం.

అరగంట గడిచింది. గోవిందరావు ఇంకా రాలేదు—క్షణ క్షణానికి రామారావులో అసహనం పెరిగిపోతూంది. కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతూ, హఠాత్తుగా ఆగి శంకరం దగ్గరగా వెళ్ళాడు.

"శంకరం! నువ్వు వెంటనే పని మొదలుపెట్టడం మంచిది. గోవిందరావు సంగతి తరవాత చూడవచ్చు."

కుదరదన్నట్టుగా తల ఊపాడు శంకరం. కోపం పట్టలేక పోయాడు రామారావు. వెంటనే జేబులో నుండి కాకు తీసి, "ఇదేమిటో చూశావా? వెంటనే మొదలుపెట్టు. లేకపోతే . . ." అని కర్కశంగా అంటున్న రామారావును చూసిన శంకరానికి తేరుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది. మెల్లిగా కుర్చీలో నుంచి లేచాడు.

ఇంతలో లాబొరేటరీ తలుపు తెరువ బోవడం, ఒక సబిన్స్‌పెక్టరు, నలుగురు కానిస్టేబుల్స్ లోపలికి రావడం క్షణంలో జరిగాయి.

"రామారావ్! కత్తి ఇలా ఇచ్చేయ్. గోవిందరావును హత్య చేసినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాం" అంటూ ముందుకు వచ్చాడు సబిన్స్‌పెక్టర్.

"ఏమిటి? ఏం జరిగింది?" అన్న శంకరం ప్రశ్నకు జవాబు చెప్పాడు.

"గోవిందరావు హత్య చేయబడ్డాడు, సార్! నిన్న రాత్రి ఒంటిగంటప్పుడు ప్రాంతాల్లో గోవిందరావు ఇంటిలోనుండి ఇతగాడు ఖంగారుగా బయటకు రావడం, చేతిలో ఏదో బరువైన పెట్టె పెట్టి ఉండటం పక్క ఇంటి వాళ్ళు చూశారు. అదీ కాకుండా, గోవిందరావును చంపడానికి ఉపయోగించిన కత్తి ఇతగాడిదే నని రమణయ్య గుర్తుపట్టి చెప్పాడుకూడా."

"చూశావా, శంకరం! అందుకనే నిన్ను త్వరగా పని మొదలు పెట్టమన్నది. ఇదంతా నీ మూలంగానే జరిగింది. ఆలస్యం చేయకుండా బంగారం చేసి ఉంటే, పీళ్ళ మొహాన ఇంత బంగారం కొట్టి తప్పించుకొనేవాడిని. నే నలా జైలు పాలవడానికి నువ్వే కారణం, నువ్వే కారణం." పిచ్చిగా అరుస్తున్న రామారావును ఈడ్చుకెళ్ళిపోయారు పోలీసులు.

"చూడండి, ప్రొఫెసర్! మీ రేదో రాగిని బంగారంగా మార్చుతామన్నారని, అందువల్లనే గోవిందరావు దగ్గరున్న రాగి కాజేయడానికి రామారావు అతగాడిని హత్య చేసి ఉండవచ్చని రమణయ్య చెప్పాడు. మీరు సాయంకాలం పోలీస్ స్టేషన్‌కు వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వవలసి ఉంటుంది" అన్న సబిన్స్‌పెక్టర్ మాట కు యాంత్రికంగా తల ఊపాడు శంకరం.

"వస్తాను, సార్! సారీ ఫర్ ది డిస్టర్బెన్స్."

శూన్యంలోకి చూస్తున్న శంకరం మెల్లిగా బీకరు దగ్గరకు వెళ్ళి, అందు లోని ద్రవపదార్థాన్ని వాష్ బేసిన్‌లోకి వంపేశాడు. అమర్చి పెట్టబడి ఉన్న పరికరాలన్నీ విప్పదీసి, ఓ మూలగా పడేసి, టెలిఫోన్ దగ్గరకు వెళ్ళి నంబరు డయల్ చేశాడు.

"కంగ్రాచ్యులేషన్స్, బ్రదర్! నువ్వే గెలిచావు. మనుష్యులు గత అనుభవాలు నేర్పిన గుణపాఠాలు ఎప్పటికప్పుడు మరిచి పోయి, మళ్ళీ అదే తప్పుడు పనులు చేస్తారని తెలుసుకున్నాను. పందెంలో నువ్వే గెలిచావు కాబట్టి, ఒప్పందం ప్రకారం నా ప్రయోగం ఇక్కడితో ఆపేస్తున్నాను. దానికి సంబంధించిన ఫార్ములాలు, వర్క్‌షీట్సు ధ్వంసం చేస్తున్నాను."

డ్రాయరు తెరిచి, కాగితాలు తీశాడు శంకరం. తన అయిదు సంవత్సరాల శ్రమకు అగ్గిపుల్ల గీసి నిప్పంటించాడు.

సుడులు సుడులుగా గాలితో కలిసి పోతున్న పొగ వంక చూస్తూ కూర్చు న్నాడు ప్రొఫెసర్ శంకరం. ★